క్లుప్తంగా

ఓటరుగా నమోదు చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

చేగుంట(తూప్రాన్): యువత ఓటరు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. గురువారం పాలిటెక్నిక్ కళాశాలలో ఓటరు నమోదుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కును కలిగి ఉండాలని, ప్రజల సంక్షేమం కోసం పాటుపడే నాయకులను ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, ప్రిన్సిపాల్ చక్రవర్తి విద్యార్థులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో అఖిలపక్ష నాయకులు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ మంజూరు కోసం రామాయంపేటలో నిర్వహిస్తున్న దీక్షలు గురువారం 127వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ డివిజన్ చేసే వరకు పోరాడుతామన్నారు. దీక్షలకు యువజన, కుల, వ్యాపార సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి.

సీపీఎస్‌ను రద్దు చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కౌడిపల్లి(నర్సాపూర్): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని యూఎస్‌పీసీ (మండల అధ్యక్షుడు శేషగిరిరావు డిమాండ్ చేశారు. ఈ నెల 12న జిల్లా కేంద్రంలో నిర్వహించే ర్యాలీ మహా ధర్న వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌తో ఉపాధ్యాయ, ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందనారు. ఓపీఎస్ పునరుద్ధరించి, ఐఆర్ ప్రకటించాలని, పీఆర్‌సీ కమిటీ ఏర్పాటు చేయాలని, బదిలీలు పదోన్నతులు చేపట్టాలని, పండితులు, పీఈటీలను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజు, ఉపాధ్యాయులు గుండయ్య, క్రిష్ణ, రమేష్, షేక్ బబ్బు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

మనోహరాబాద్(తూప్రాన్): జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, సీఎంఆర్ హాస్పటల్ ఆధ్వర్యంలో మండలంలోని రామాయిపల్లి గ్రామంలోని ఇండస్ మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంపెనీలో పని చేసే సుమారు 170 మంది కార్మికులకు బీపీ, షుగర్, కంటి, రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ, హెచ్‌ఆర్ వాహిద్, దుర్గాప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్, మోహంతి తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధికి కృషి



యూనిట్లను అందిస్తున్న ఎంపీపీ హరికృష్ణ

శివ్వంపేట(నర్సాపూర్): రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుందని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. గురువారం మండలంలోని పిల్లుట్ల గ్రామంలో లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కులవృత్తులను ఆర్థిక చేయూత అందించేందుకు ప్రభుత్వం రుణాలు అందిస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దపులి రవి, బీఆర్ఎస్ నాయకుడు బండారి గంగాధర్, నరేందర్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌గా చంద్రశేఖర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): మండల తహసీల్దార్‌గా చంద్రశేఖర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన రాజేశ్వర్‌రావు కలెక్టరేట్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో నిర్మల్ జిల్లా బైంసాలో పని చేసిన చంద్రశేఖర్‌రెడ్డి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ మహేందర్ శుభాకాంక్షలు తెలిపారు.

కుల వృత్తిదారులకు చేయూత

ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: కుల వృత్తిదారులకు చేయూత అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టర్ రాజర్షిషాతో కలిసి నియోజకవర్గంలోని 274 మంది వృత్తిదారులకు లక్షరూపాయల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. లక్షల రూపాయల చెక్కుల పంపిణీ ప్రారంభం మాత్రమేనని, ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందన్నారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్, మూడు పంటలకు నీరు, రెసిడెన్షియల్ స్కూల్స్, వైద్య కళాశాలలను ఏర్పాటుకు చేశామని, మంత్రి హరీశ్‌రావు చొరవతో మెదక్ అర్బన్, మెదక్ మండలం, పాపన్నపేట, నిజాంపేట, రామాయంపేట, అర్బన్ ప్రాంతం, చిన్నశంకరంపేటకు చెందిన లబ్ధిదారులకు లక్ష రూపాయల చెక్కులను అందించినట్లు పేర్కొన్నారు. ప్రతీ నెలా 18 మందిని ప్రణాళిక ప్రకారం ఎంపిక చేస్తామని, ప్రక్రియ నిరంతరం ఉంటుందన్నారు. కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ బీసీ కుల వృత్తిదారులకు ప్రభుత్వం అందిస్తున్నా సాయంతో ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్య, అదనపు కలెక్టర్ రమేశ్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి శంకర్, పీఏసీఎస్ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆటలు ముఖ్యమే

రామాయంపేట(మెదక్): విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు ముఖ్యమని, ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం రామాయంపేటలో యువజ్యోతి స్పోర్ట్స్' క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ జిల్లా ఫుట్‌బాల్ క్రీడోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం పెంపొందుతుందన్నారు. 13 నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులకు నిర్వహించిన క్రీడల్లో మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాలకు చెందిన పది టీంలు పాల్గొన్నాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, యువజ్యోతి క్లబ్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, జిల్లా క్రీడల అధికారి నాగరాజు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'కి దరఖాస్తుల వెల్లువ



నర్సాపూర్‌లోని ఓ జిరాక్స్ సెంటర్ వద్ద దరఖాస్తుదారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): గృహలక్ష్మి పథకానికి జిల్లాలోని ఆయా మండలాల్లో లబ్ధిదారులు బారీగా దరఖాస్తులు చేసుకుంటున్నారు. చిట్కుల్ గ్రామంలో గురువారం 85 దరఖాస్తులు వచ్చాయని కార్యదర్శి తిరుపతి తెలిపారు.

తూప్రాన్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇప్పటి వరకు 937 మంది గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రజలు మీసేవా కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు.

కార్యాలయాలు కళకళ..

కౌడిపల్లి(నర్సాపూర్): గృహలక్ష్మి పథకంలో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన లబ్ధిదారులతో గురువారం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలు కళకళలాడాయి. జిరాక్స్ సెంటర్లు, మీసేవా కేంద్రాల వద్ద జనం కనిపించారు. ఆవరణలో కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులు తీసుకున్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో 126, తహసీల్దార్ కార్యాలయానికి 482 దరఖాస్తులు వచ్చాయి.

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గంలో గృహలక్ష్మి పథకానికి గురువారం వరకు 1,375 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ శంకర్ తెలిపారు.

రామాయంపేట(మెదక్): గృహలక్ష్మి పథకం కింద నార్సింలో 569 దరఖాస్తులు వచ్చాయని ఎంపీపీ చిందం సబిత తెలిపారు.

శివ్వంపేటలో 2,436 దరఖాస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): గృహలక్ష్మి పథకానికి మండలం నుంచి 2436 దరఖాస్తులు వచ్చాయని సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి చెప్పారు.

నర్సాపూర్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసేందుకు ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. గురువారం 700 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

'డబుల్' పంపిణీలో ఆలస్యమెందుకు?



ధర్నాకు వెళ్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): ఏళ్లు గడిచినా పేదలకు డబుల్ బెడ్‌రూంలు ఇళ్లు ఎందుకు ఇవ్వలేదని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మెదక్‌లో నిర్వహించే ధర్నా కోసం చేగుంటలో కార్యకర్తలతో ర్యాలీగా తరలి వెళుతూ విలేకరులతో మాట్లాడారు. చేగుంట, మాసాయిపేట, నార్సింగి మండలాల్లో ఇంతవరకు డబుల్ బెడరూంలు అందించకపోవడం విచారకరమన్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి బీఆర్ఎస్ నాయకులు చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నిరుపేదలందరికీ డబుల్ బెడ్‌రూంలు అందించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని తెలిపారు. ఆయనతో బీజేపీ నాయకులు భూపాల్, చారీ, గోవింద్, బాల్‌చందర్, రాంచంద్రం, సాయి, సంతోష్‌రెడ్డి, నర్సింలు తదితరులు ఉన్నారు.

చెట్లను నరికిన వారిపై చర్యలు

సాక్షి స్పందన

మెదక్: సాక్షి దిన పత్రికల్లో గురువారం ప్రచురితమైన 'అడవికి రక్షణేదీ' కథనానికి ఆ శాఖ అధికారులు స్పందించారు. హవేళీ ఘనాపూర్ మండలం కప్రాయిపల్లి, రాజిపేట అటవీ ప్రాంతంలో చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని డీఎఫ్ఓ రవిప్రసాద్ తెలిపారు. బాధ్యులను గుర్తించామని, ఆర్డీఓ ఎదుట బైండోవర్ చేయనున్నట్లు పేర్కొన్నారు.

నవాబుపేటలో కొత్త పీర్ల సందడి



వేడుకలో పాల్గొన్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని నవాబుపేటలో గురువారం కొత్తపీర్ల పండగను గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కులమతాలకు అతీతంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పీర్ల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి దర్శించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పాడిపంటలతో సంతోషంగా ఉండాలని కోరినట్లు తెలిపారు.

విద్యార్థుల సమస్యలపై ఉద్యమించాలి



హర్షవర్ధన్‌ను సన్మానిస్తున్న నాయకులు

నర్సాపూర్: విద్యార్థుల సమస్యలపై ఉద్యమించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన హర్షవర్ధన్‌ను గురువారం క్యాంపు కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. రాష్ట్ర కమిటీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు వెంకటేష్, హకీమ్, రియాజ్, ధన్‌సింగ్, నర్సింలు, అల్తాఫ్, సోఫి, పాల్గొన్నారు.

జరిమానా

నిజాంపేట(మెదక్): మండలంలోని చల్మెడ గ్రామానికి చెందిన రామాంజనేయగౌడ్ మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని పోలీసులు మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా రూ.వేయి జరిమానా విధించినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



నిరసన తెలుపుతున్న ఏఎన్ఎంలు

నిజాంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో పని చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని చల్మెడ, బచ్చురాజుపల్లి, వెంకటాపూర్.కె, నస్కల్ గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాల వద్ద ఏఎన్ఎంలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరోనా మహమ్మారి సమయంలో ప్రాణాలకు తెగించి పని చేశామని, తమకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కంటి వెలుగు కార్యక్రమంలో చురుగ్గా పని చేసిన మమ్మల్ని గుర్తించకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఏఎన్ఎం నోటిఫికేషన్ రద్దు చేసి తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సెకండ్ ఏఎన్ఎంలు రమ్య, అనిత, మంజుల, గౌరీ, సలోని, నిర్మల, రమ, బాలమణి, అర్చన, స్వప్న, అంజలి, రేణుక, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

పాపన్నపేట(మెదక్): ప్రభుత్వం రెండో ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం పాపన్నపేట పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్లుగా సేవలు చేస్తున్న తమను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులరైజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో స్వప్న, మంజుల, ప్రమీల, సరిత, సంగీత, బాలమణి, సాయమ్మ, గంగమణి పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెకండ్ ఏఎన్ఎంలు గురువారం పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించాలని కోరారు.

పరస్పర సహకారంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ సిద్ధరాంలు

నిజాంపేట(మెదక్): మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ దేశెట్టి సిద్ధరాంలు అన్నారు. గురువారం నిర్వహించిన ఎంపీపీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న కార్యక్రమాలకు సర్పంచులకు సమాచారం ఇవ్వడంలేదని నార్లాపూర్ సర్పంచ్ అమరసేనారెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సీజన్‌లో విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయ అధికారి సతీశ్ పేర్కొనగా, మండలంలో 573 మహిళా సంఘాల్లో 79 సంఘాలకు రూ.5.97 కోట్ల మేర రుణాలు అందించినట్లు ఆ శాఖ అధికారి పేర్కొన్నారు. వెటర్నరీ, విద్యుత్, భగీరథ శాఖల అధికారులు వారి శాఖల్లో జరుగుతున్న పనులను వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ అందె ఇందిర, కల్వకుంట సహకార సంఘం చైర్మన్ అందె కొండల్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపడీఓ గిరిజారాణి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బాబురావు

నర్సాపూర్ రూరల్: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు వడ్డి బాబూరావు అన్నారు. కాగజ్ మద్దూరు జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఏదైనా ఆత్మ స్థైర్యం ఉంటే సాధించగలమని, యుక్తవయసులో భావోద్వేగాలను నియంత్రించుకోవాలన్నారు. అతి నిద్ర, బద్ధకం మానుకోవాలని, ఎప్పటి పని అప్పుడే చేయాలని వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీశైలం, ఉపాధ్యాయులు డా.సూర్యప్రకాశ్ రావు, షరీఫ్, శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, అప్పలనాయుడు, కవిత, నర్సింహులు పాల్గొన్నారు.

అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలి



కలెక్టరేట్ వద్ద రెడ్డిపల్లి గ్రామస్తులు

మెదక్ కలెక్టరేట్: అర్హులైన వారికి దళితబంధు అందించాలని నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామ దళితులు కోరారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్సీ అభివృద్ధి కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో 56 మంది దళితులు ఉంటే కేవలం 5మందికే ఇస్తామని సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించి అందరికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మైసయ్య, రమేష్, సత్తయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ఉంటా



ఆర్థికసాయం అందిస్తున్న జెడ్పీటీసీ మహేశ్

శివ్వంపేట(నర్సాపూర్): ఆపదలో ఉన్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు అండగా ఉంటానని జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా అన్నారు. మండలంలోని ఉసిరికపల్లికిలో మృతిచెందిన పోతరాజు భూమమ్మ, అనారోగ్యంతో బాధపడుతున్న కుందనపల్లి నర్సమ్మ కుటుంబాలకు గురువారం రూ.5వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయనతో బీఆర్ఎస్ నాయకుడు కృష్ణారావు, సర్పంచ్ బాబురావు, ఎంపీటీసీ సత్తిరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, బిక్షపతి, లక్ష్మీనారాయణ, బాల్‌రాజు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి పోరాడుతాం



జెండా ఎగురవేసిన నాయకులు

నర్సాపూర్: ప్రభుత్వ విద్య, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం యూటీఎఫ్ అనేక పోరాటాలు చేసిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం పట్టణంలోని యూనియన్ ఆఫీసు ఎదుట జెండా ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గణేష్, డాకియ, నాగుల్‌మీరా, రాజు, కనకరాజు, నాయుడు, భాస్కర్, కళారాములు, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

కరెంటు కోసం అన్నదాతల అవస్థలు



కట్టెల సాయంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలిస్తున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): సాగు నీరు అందించే పొలాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో రైతులకు తిప్పలు తప్పడంలేదు. బీమ్లా పంచాయతీ శంకర్ తండాలో వ్యవసాయ పొలాల వద్ద గురువారం బోరుబావుల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో రైతులు కట్టెల సాయంతో దానిని వాహనం దగ్గరకు తరలించేందుకు నానా తిప్పలు పడ్డారు. అధికారులు పట్టించుకోకపోవడంతో సొంతంగా డబ్బులు వేసుకొని మరమ్మతుకు తరలిస్తున్నామని, పొలాల మధ్యలో కాకుండా అనువైన స్థలంలో దీనిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆర్థిక సాయం**



చిలప్‌చెడ్(నర్సాపూర్): కిడ్నీ ఫెయిల్యూర్‌తో వైద్య చికిత్సకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న శీలాంపల్లి గ్రామానికి ఎండీ.పాషాకు బీఆర్ఎస్ యూత్ నాయకుడు ఎల్లయ్యగారి రాజేందర్‌రెడ్డి ఆర్థికసాయం అందించారు. గురువారం బాధిత కుటుంబానికి రూ.13వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో భగవంత్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రారెడ్డి, సాయిరెడ్డి, దుర్గరాం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **గ్రామ పంచాయతీకి భూదానం**



చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని అంతారం పంచాయతీ భవన నిర్మాణానికి కల్వగూరు శంకర్, సోమక్కపేటకు చెందిన రామగోని శ్రీకాంత్‌గౌడ్ రెండున్నర గుంటలు భూమి ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు గురువారం బాండ్ పేపర్‌పై రాసి, సర్పంచ్ అశోక్‌గౌడ్‌కు అందజేశారు. దీనిపై సర్పంచ్, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలోపంచాయతీ సెక్రటరీ రవిశంకర్ రెడ్డి, ఉప సర్పంచ్ నరహరి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **ఆలయ నిర్మాణానికి విరాళం**

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి పంచాయతీ పరిధి శేరీల గ్రామంలో నిర్మిస్తున్న మల్లన్న గుడి నిర్మాణానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి విరాళం అందజేశారు. అనంతరం హస్తాల్ పూర్ గ్రామంలో ఇటీవల మరణించిన నర్సయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

◆ **ధర్నాకు తరలిన బీజేపీ నాయకులు**



కౌడిపల్లి(నర్సాపూర్): బీజేపీ ఆధ్వర్యంలో మెదక్‌లో నిర్వహించిన ధర్నాకు బీజేపీ మండల అధ్యక్షుడు రాకేష్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు తరలి వెళ్లారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలేదని ఆరోపించారు. ఎన్నికల కోసమే దళితబంధు, రుణమాఫీ, గృహలక్ష్మి పథకాలంటూ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు.

◆ **శ్రీసుబ్రహ్మణ్యేశ్వరుడికి భస్మార్చన**

వర్గల్(గజ్వేల్): రాష్ట్రంలో సుప్రసిద్ధ వర్గల్ శ్రీవిద్యా సరస్వతి క్షేత్రంలోని సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో గురువారం కృత్తిక మహోత్సవం ఘనంగా జరిగింది. సుబ్రహ్మణ్యేశ్వరుడి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని మూలవిరాట్టుకు విశేష అభిషేకం, లక్ష సుబ్రహ్మణ్యనామాలు పఠిస్తూ స్వామివారికి భస్మార్చన చేశారు. భక్తు లు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.